క్లుప్తంగా

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



వంట సామగ్రి పరిశీలిస్తున్న ఎస్‌వో స్వర్ణలత

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కేజీబీవీ ఎస్‌వో స్వర్ణలత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ వసతి గృహం వంట సామగ్రిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాల సందర్శన



మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ దుర్పతబాయి

కెరమెరి: మండలంలోని హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాలను జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి సోమవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. రుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. సరిపడా గదులు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు పేర్కొనగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉపాధ్యాయులతో కలిసి ఆవరణలో మొక్కలు నాటారు. కోవ లక్ష్మి యువసైన్యం మండలాధ్యక్షుడు కొట్నంగే శ్రీనివాస్, కినక సకారాం, హెచ్‌ఎం ప్రేందాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మూడు రోజులైనా దొరకని ఆచూకీ

ఆసిఫాబాద్‌రూరల్: తుంపల్లి మోరంవాగులో గల్లంతైన ఇద్దరి ఆచూకీ మూడు రోజులైనా దొరకడం లేదు. మండలంలోని తుంపెల్లి గ్రామానికి చెందిన మోహన్, కౌశిక్‌లు గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం వాగులో ఆసిఫాబాద్ నుంచి కాగజ్‌గర్ వరకు గజ ఈతగాళ్ల సాయంతో అధికారులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టినా వారి ఆచూకీ లభించ లేదు. ఎంపీపీ మల్లికార్జున్, తహసీల్దార్ రామ్మోహన్ రావుతో పాటు ఇతర అధికారులు వాగువద్ద పరిస్థితిని పరిశీలించారు. కాగా గల్లంతైన వారి కోసం కుటుంబ సభ్యులు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు.

జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

సిర్పూర్(టి): రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా ఉపాధ్యక్షుడు జమీల్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండలంలోని పాత్రికేయులతో కలిసి సిర్పూర్(టి) పోస్టాఫీసు వద్ద పోస్టుకార్డులతో ఆయన నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: బ్రో
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: బ్రో

\- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.200
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	100
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	100
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	100
క్యాబేజి	60

\-ఆసిఫాబాద్‌అర్బన్



నీరు లేక వెలవెలబోతున్న చెరువు



తెగిన మత్తడి

ఖాళీగా కర్జి చెరువు

జిల్లాలోని చెరువులు, వాగులు, వంకలు భారీ వర్షాల కారణంగా పొంగి పొర్లుతుంటే దహెగాం మండలంలోని కర్జి గ్రామ సమీపంలోని చెరువు మాత్రం నీరు లేక వెలవెలబోతుంది. గత ఏడాది కురిసిన వర్షాలకు వరద పోటెత్తడంతో చెరువు మత్తడి తెగి కొట్టుకుపోయింది. మత్తడికి ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చెరువులో నీరు ఖాళీ అవుతోంది. చెరువులో నీరు నిల్వ ఉండకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. మత్తడికి మరమ్మతులు చేపట్టాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – దహెగాం

పదవీ విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం



జ్ఞాపిక అందజేస్తున్న మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో సోమవారం ఉద్యోగ విరమణ పొందిన దండ నాయకుల దత్తాత్రిరావును ఓసీపీ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. గని మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్ దత్తాత్రిరావు దంపతులను పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు, వెల్ఫేర్ ఆఫీసర్ వేణు, టీబీజీకేఎస్ ఫిట్ కార్యదర్శి వెంకటేశం, జీఎం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మారిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మీటింగ్‌కు ముహూర్తం ఎప్పుడో!

- మూడు నెలలు దాటినా నిర్వహించని సర్వసభ్య సమావేశం
- గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న మండలవాసులు



ఎంపీడీవో కార్యాలయం

తిర్యాణి: మూడు నెలలు గడిచినా మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించకపోవడంతో మండలంలో సమస్యలు పేరుకుపోయాయి. మండలంలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, వివిధ అంశాలపై చర్చ జరిపేందుకు ప్రతీ మూడు నెలలకోసారి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులతో పాటు మండల పరిషత్ సభ్యులు(ఎంపీటీసీ), సర్పంచులు హాజరై వారి పరిధిలోని సమస్యలను ప్రస్తావిస్తారు. కానీ గడువు దాటినా సమావేశం నిర్వహించకపోవడంతో గ్రామాల్లోని సమస్యలు చర్చకు రావడం లేదు. చివరిసారిగా ఏప్రిల్ 24న సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

రాజ్యమేలుతున్న సమస్యలు..

మండలంలో 29 గ్రామపంచాయతీలుండగా 114 అనుబంధ గ్రామాలున్నాయి. సుమారు 25వేలకు పైగా జనాభ ఉంది. ఇందులో దాదాపు 90 శాతం వరకు ఆదివాసీలే ఉన్నారు. వర్షాకాలం కావడంతో మండలంలోని మారుమూల ప్రాంతాల్లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మండలంలోని గుండాల గ్రామానికి వెళ్లేందుకు కనీస రోడ్డు సౌకర్యం లేదు. దాదాపు ఆరు కిలోమీటర్లు కాలినడకన వెళ్తే తప్ప వారి కనీస అవసరాలు తీరని పరిస్థితి ఉంది. అమీన్‌గూడ గ్రామంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో దుగ్గాపూర్, కోయతలండి గ్రామాలకు వాగు ఉప్పొంగితే రాకపోకలు నిలిచిపోతున్నాయి. కొటాగం, తాటిగూడ, గోపెర, గీసుగూడ, కేరిగూడ, ఎర్రబండ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. బుగ్గగూడ కల్వర్టు తరచూ కోతకు గురవుతుండడంతో వర్షం వచ్చిందంటే ఆసిఫాబాద్ నుంచి రోంపెల్లి వరకు నడిచే బస్సు సర్వీసు సేవలు నిలిచిపోతున్నాయి. వీటితో పాటు మండలంలో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఇలాంటి మరెన్నో సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాలని సభ్యులు కోరుతున్నారు.

సమావేశం నిర్వహించాలి



మూడు నెలలు దాటినా అధికారులు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించకపోవడం సరికాదు. ఎన్నో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాటిపై సమావేశంలో చర్చ జరగాలి. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి. - సార రమేశ్ గౌడ్, ఎంపీటీసీ, గడలపెల్లి

త్వరలోనే నిర్వహిస్తాం

వారం రోజుల క్రితం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం వర్షాల కారణంగా వాయిదా వేశాం. ఎంపీపీ, ఎంపీడీవో అనుమతితో త్వరలోనే సమావేశం నిర్వహిస్తాం. సమావేశం ఎప్పుడు ఉండేది తెలియపరుస్తాం.

\- శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఎంపీడీవో కార్యాలయం

అధికారులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పూర్తిస్థాయి ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లోని సెక్టార్, పోలీసు అధికారులతో వచ్చే సాధారణ శాసనసభ ఎన్నికలకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సెక్టార్ జోనల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి చేపట్టాల్సిన పనులను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 584 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 78 రూట్లను ఏర్పాటు చేయడంతో పాటు రూట్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావ్, ఆర్‌డీవో రాజేశ్వర్‌రావ్, సీఐలు, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ ప్రతినిధులు

వాంకిడి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులకు సోమవారం షీటీమ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీటీమ్ ఇన్‌చార్జి సునీత మాట్లాడుతూ హింస, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాల బారిన ఎవరైనా పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, షీటీమ్ ఆసిఫాబాద్ నంబర్ 8712670564కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సభ్యులు శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన



దహెగాం: వంటావార్పులో పాల్గొన్న కార్మికులు



తిర్యాణి: భిక్షాటన చేస్తున్న నాయకులు

దహెగాం: పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె సోమవారం 26వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం ఎదుట వంటావార్పు చేసి నిరసన తెలిపారు. పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, కార్మికులు రవీందర్, కామెర రాజ్‌కుమార్, ప్రభాకర్, సాయి, వెంకటేశ్, మారుతి, దినేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: గ్రామపంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మె 26వ రోజుకు చేరుకున్న సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసీ సంఘం నాయకుడు పెందూర్ ధర్ము గాంధీ వేషధారణ ధరించి సమ్మెకు మద్దతు తెలిపాడు. తిరుపతి, శంకర్, జంగు, రవి తదితరులు ఉన్నారు.

రెబ్బెన: పంచాయతీ కార్మికుల సమస్యలపై అసెంబ్లీని ముట్టడిస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని దీక్షశిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల న్యాయపరమైన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని లేకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు. జేఏసీ నాయకులు సుధాకర్, వెంకటి, శంకర్, బాబాజీ, ప్రకాశ్, దేవాజీ, లక్ష్మణ్, సత్యనారాయణ, శోభ, లక్ష్మి పాల్గొన్నారు.

కౌటాల: ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 26వ రోజు కొనసాగింది. సమ్మెలో కార్మికులు కరుణాకర్, లింగయ్య, ప్రకాశ్, రవి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం మానుకోవాలి'



మాట్లాడుతున్న కుర్సింగ ఓంప్రకాశ్

బెజ్జూర్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పపై చేస్తున్న అసత్య ప్రచారం మానుకోవాలని బెజ్జూర్ పీఏసీఎస్ చైర్మన్ కుర్సింగ ఓంప్రకాశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే అన్నదాన సత్రం పెట్టి వేల మందికి భోజనం పెడుతున్నారన్నారు. దళిత, గిరిజనులకు అన్ని తానై వివాహాలు జరిపిస్తున్నారని, నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. కోఆప్షన్ సభ్యుడు బాషారత్ ఖాన్, కాటేపల్లి సర్పంచ్ సిడం భీమ్ రావు, ఉప సర్పంచ్ శంకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, యూత్ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలి



బెజ్జూర్: రైతులకు సూచనలు చేస్తున్న ఏవో

బెజ్జూర్: పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా రైతులు చూడాలని మండల వ్యవసాయాధికారి రాజులనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పాపాన్‌పేట్ గ్రామంలో పత్తి పంటలను పరిశీలించారు. వర్షాలు తగ్గిన తర్వాత పత్తి పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలను వివరించారు. పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 10 గ్రాములు, లేదా మల్టీకే (13-0-45) 10 గ్రాములు, యూరియా 20 గ్రాములు లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. చీడపీడల ఉధృతి పెరగకుండా కార్బండిజమ్ 2.5 గ్రాములు, మాంకోజెబ్ లేదా పిప్రోనిల్ 2 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అధికావర్షాల కారణంగా తెగులు సోకే అవకాశం ఉందని, దీనికోసం కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క మొదలు బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలని వివరించారు. సందేహాలు ఉంటే ఏఈవోల ద్వారా నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు.

పత్తి పంటల పరిశీలన

పెంచికల్‌పేట్: మండలంలోని గన్నారం గ్రామ శివారులోని పత్తి పంటలను సోమవారం ఏఈవో శ్రీవిద్య పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో రైతులు పత్తి పంటల్లో నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని చేడువాయిలో ఏఈవో గౌసియా బేగం పంటలు పరిశీలించారు.

నిలిచిన బీటీ రోడ్డు పనులు



పనులు నిలిచిపోయిన దహెగాం -హత్తిని రోడ్డు

దహెగాం: మండల కేంద్రం నుంచి హత్తిని వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో మండల వాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద నిధులు మంజూరు కాగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. బీటీ రోడ్డు వేసేందుకు కావాల్సిన సామగ్రి రాకపోవడంతో గత నెలలో బీటీ వేయడం అర్ధాంతరంగా నిలిపివేశారు. మూడు కిలోమీటర్ల రోడ్డులో హత్తిని నుంచి దహెగాం వైపు కిలో మీటరు వరకు రోడ్డు వేసి ఆపేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పనులు నిలిపివేసి సుమారు 15 రోజులు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. బీటీ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

నేడు మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీ కోసం మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్‌లో నిర్వహించిన ప్రవేశపరీక్ష రాసిన ఆసక్తి గల విద్యార్థులు సర్టిఫికెట్లతో రావాలని సూచించారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌అర్బన్: ఏఐటీయూసీ అనుబంధ సంఘం తెలంగాణ ఫారెస్ట్ నర్సరీ వర్కర్స్ యూనియన్ కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దివాకర్, ఉపాధ్యక్షులుగా రాజేశ్, యశోద, ప్రధాన కార్యదర్శిగా దుర్గం సంఘమిత్ర, సహాయ కార్యదర్శిలుగా వసంత, సుజాత, కోశాధికారిగా సుజాతను ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా మాయ, కౌసల్య, సరిత, భాగ్య, కవితను నియమించారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సరిపడా వైద్యుల నియామకం జరిగినా రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదని పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ అహ్మద్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక వైద్య సేవలు అందించి మంచిర్యాల, కరీంనగర్, చంద్రాపూర్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని ఆరోపించారు. వైద్యులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆలస్యంగా విధులకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో డైరెక్టర్ శ్యాంరావ్, పోషన్న, వార్డు సభ్యులు రాజయ్య పాల్గొన్నారు.


నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: మండలంలోని అనుకోడలో మంగళవారం షణ్ముఖ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వినయ్ కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, ఉచితంగా రక్త పరీక్షలు, మందులు పంపిణీ చేస్తామన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

వాంకిడి: మంగళవారం నుంచి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సీడీపీవో రెబ్కా ఓ ప్రకటనలో తెలిపారు. ఏడు రోజులపాటు నిర్వహించే తల్లి పాల వారోత్సవాల్లో తల్లిపాల ప్రాముఖ్యత, పాలతో పిల్లలకు లభించే పోషకాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని రోడ్లకు మరమ్మతులు



కోతకు గురైన రోడ్డు పరిశీలిస్తున్న పోలీసులు

సిర్పూర్(టి): మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంత గ్రామాలైన భూపాలపట్నం -కేశవపట్నం గ్రామాల మధ్యలోని ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయి కోతకు గురికావడంతో సోమవారం సీఐ సాదిక్ పాష, ఎస్సై దీకొండ రమేశ్‌ల ఆధ్వర్యంలో పోలీసులు పరిశీలించారు. గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలగకుండా మరమ్మతులు చేపట్టారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మరమ్మతులు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సైలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ ఎస్సైలుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మధుకర్, వెంకటేష్, విక్రమ్‌లు సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్‌లో జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రెబ్బెన: మండలంలోని నంబాలకు చెందిన ఇద్దరికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను సోమవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చెన్న సోమశేఖర్ లబ్ధిదారులకు అందజేశారు. పిరిసింగుల కిష్టయ్యకు రూ. 45వేలు, రాంటెంకి మౌనికకు రూ.37,200ల చెక్కులను అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటి, ఆడప కూశన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.